సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 4 । మే । 2024



అమ్మో.. ఆ పార్టీలా

ఇచ్ఛాపురంలో టీడీపీ, జనసేన ఖాళీ అవుతున్నాయి. వైఎస్సార్ సీపీలో వచ్చి చేరుతున్నారు. - 10లో



పెళ్లి కావడం లేదని..

పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుమందు తాగేశాడు. - 10లో

ఒక్క బూత్‌లో 1,400 మంది ఓటర్లు

హిరమండలం: ఎన్నికల నిర్వహణలో ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా అధికారులు చూస్తారు. ఈవీఎంలకు అనుసంధానించి ఉండే వీవీ ప్యాట్‌లో థర్మల్ కాగితం పొందుపరుస్తారు. ఈ కాగితం 1,500 స్లిప్‌లను మాత్రమే ప్రింట్ చేస్తుంది. ఇందులో వంద వరకు కాగితపు స్లిప్‌లు పోలింగు రోజున మాక్‌పోలింగ్ ప్రక్రియ కోసం ఖర్చవుతాయి. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,400 మంది లోపు వరకు మాత్రమే ఓటర్లు ఉండేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది.

న్యూస్‌రీల్

దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ సస్పెన్షన్

అరసవల్లి: జిల్లా దేవదాయ శాఖకు చెందిన నరసన్నపేట గ్రూప్ టెంపుల్స్ ఈఓగా పనిచేస్తున్న శ్రీకాకుళం డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరమణను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నరసన్నపేట గ్రూప్ టెంపుల్స్‌లో భాగంగా ఉన్న శ్రీకాకుళం మండలం సింగుపురం కొండపై ఉన్న శ్రీ హటకేశ్వర స్వామి వారి ఆలయంలో గత నెల 24న జరిగిన జాతర మహోత్సవం అనంతరం హుండీ కానుకల లెక్కింపును అనధికారికంగా చేపట్టడంతో పాటు నిబంధనలను పాటించకపోవడంపై ఈఓ వెంకటరమణపై ఉన్నతాధికారులు పైచర్యలకు ఉపక్రమించారు. ఆలయ హుండీ లెక్కింపునకు సంబంధించి జిల్లా దేవదాయ శాఖాధికారి కార్యాలయానికి ఇతర నిర్వహణ శాఖలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే హుండీలను తెరిపించారన్న విషయం జిల్లా అధికారుల దృష్టికి రావడంతో విచారణకు ఆదేశించారు. ఈ మేరకు విచారణ అనంతరం శ్రీకాకుళం డివిజన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటరమణను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డిప్యూటీ కమిషనర్ సుజాత ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌స్పెక్టర్‌గా రవికుమార్‌కు బాధ్యతలను అప్పగించారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం




శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని జిల్లాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన 5 నుంచి 18 ఏళ్ల లోపు గల బాలల నుంచి కేంద్ర ప్రభుత్వ స్త్రీ,శిశు సంక్షేమ శాఖ జాతీయ ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కారాలను ప్రదానం చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్సీపీసీఆర్) సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యంతో పాటు వివిధ వాటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన, దేశానికి చెందిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల బాలలు జూలై 31వ తేదీ లోపు హెచ్‌టీటీపీఎస్ డాట్ అవర్డ్స్‌డాట్ జీఓవీడాట్ ఇన్ వెబ్ సైట్ ద్వారా పంపించాలని సీతారాం సూచించారు.

'హింసకి తావులేని ఎన్నికలే లక్ష్యం'



శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా, రీ పోలింగ్ జరగకుండా ఉండేలా పని చేయడమే ప్రధాన లక్ష్యం కావాలని భారత ఎన్నికల కమిషన్, సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. ఆయన శుక్రవారం జిల్లాల ఎన్నికల అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా నితేష్ మాట్లాడుతూ రీ పోల్‌కు తావు లేకుండా పారదర్శక ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా అందరూ కృషి చేయాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కీలకమని, వారికి ఈవీఎం వాడకంపై పూర్తి అవగాహన ఉండాలని, వారు పోలింగ్ ప్రక్రియలో చేయాల్సిన పనులు, చేయకూడని పనులు అనే అంశాలు స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియలో లోపం ద్వారా రీపోల్‌కు అవకాశం ఉండరాదని స్పష్టం చేశారు. ఈవీఎం వినియోగం, రీప్లేస్మెంట్ కు ఒక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఉందని ఆ మేరకు మాత్రమే చర్యలు ఉండాలని తెలిపారు.

జిల్లా నుంచి సాధారణ పరిశీలకులు శేఖర్ విద్యార్థి మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. పోలీస్ అబ్జర్వర్ దిగంబర్ పి.ప్రధాన్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు ఏర్పాటయ్యాయని, వాటిని తాను స్వయంగా పరిశీలించానని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలాని సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల ఏర్పాటు, అంతర్ జిల్లాల చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు సీజర్ అంశాలు, ఎన్నికల వ్యయ పరిశీలన జిల్లాలో పక్కాగా ఉన్నాయని, జిల్లాలో సుమారు రూ. 4 కోట్ల వరకు సీజ్ చేశారని తెలిపారు. ఇప్పటికే రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశం నిర్వహించి తదుపరి ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులు బీఎల్వోల ద్వారా సంబంధిత ఓటరుకు పంపిణీ చేయడం జరుగుతోందని అన్నారు.



● అచ్చెన్న దృష్టిలో

ఉద్యోగులంటే.. ఊడిగం చేసే వారే!

'ఒరే.. ఏరా..' ఉద్యోగులను అచ్చెన్నాయుడు పిలిచే విధానమిది. 'బట్టలూడదీసి కొడితే నీకు దిక్కెవరే..' ఓ మహిళా కానిస్టేబుల్‌ను ఉద్దేశించి అచ్చెన్నాయుడు అన్న మాట ఇది. 'ఏయ్ ఎగ్‌స్ట్రా చేయొద్దు. ట్రైనింగ్ ఎవరిచ్చారు. నన్ను ఆపడానికి నీకు ఎవడిచ్చాడు హక్కు' పోలీసులను ఉద్దేశించి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి నోటి వెంట వచ్చిన వ్యాఖ్యలివి. ఒంటి నిండా మదం, గొంతు నిండా విషం నింపుకున్న అచ్చెన్నాయుడు ప్రభుత్వ ఉద్యోగులను చాలాకాలంగా చులకనగా చూస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు, అధికారం లేనప్పుడు కూడా ఆయన తీరు మారలేదు. ఎన్నికల నేపథ్యంలో అచ్చెన్న వ్యవహార శైలిని ఉద్యోగులు విశ్లేషించుకుంటున్నారు.

- ప్రభుత్వ ఉద్యోగులపై కింజరాపు అచ్చెన్నాయుడు దురుసు ప్రవర్తన
- అధికారంలో ఉన్నంత కాలం అదే పంథా
- ప్రతిపక్షంలోనూ మారని తీరు
- ఎన్నికల నేపథ్యంలో విశ్లేషించుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు



గతంలో పోలాకిలో జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో సూర్యారావు అనే కానిస్టేబుల్‌పై అచ్చెన్నాయుడు దాడి చేశారు. 'నిన్ను తుపాకీ తిరగేసి కొడితే నీకు దిక్కెవరం'టూ అచ్చెన్నాయుడు బెదిరించారు. సంఘటనపై అప్పట్లో అచ్చెన్నాయుడుపై కేసు నమోదు చేశారు.



'ఏయ్ ఎగ్‌స్ట్రా చేయొద్దు. ట్రైనింగ్ ఎవరిచ్చారు. నన్ను ఆపడానికి నీకు ఎవడిచ్చాడు హక్కు. యూజ్‌లెస్ ఫెలో' అని రాజధాని పోలీసు ఉన్నతాధికారులపై నోరు పారేసుకుని చివరికి కోర్టు ఆదేశాలతో కింజరాపు అచ్చెన్నాయుడు లొంగిపోయారు.

ఈఎస్‌ఐ కుంభకోణం కేసులో అరెస్టైనప్పుడు కోటబొమ్మాళి ఆస్పత్రి వద్ద వైద్య పరీక్షలు నిర్వహణ కోసం పోలీసులు తీసుకురాగా...అక్కడున్న సీఐ నీలయ్యను బెదిరించారు. 'హోం మినిష్టర్‌ను అవుతాను. నీ లెక్క తేలుస్తాను' అంటూ వార్నింగ్ ఇచ్చారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులపై కింజరాపు అచ్చెన్నాయుడికి ఉన్న గౌరవమిది. ఒరే..ఏరా అన్న పిలుపే తప్ప ఆయనలో అంతకుమించి సంస్కారం లేదని పలు సందర్భాల్లో తేటతెల్లమైంది. మంత్రి హోదాలోనే కాదు ప్రతిపక్ష నేతగా కూడా అచ్చెన్నాయుడు వ్యవహార శైలి వివాదాస్పదమే. ప్రభుత్వ ఉద్యోగులు అన్నా, అధికారులన్నా చిన్నచూపే. ప్రతి దానికి అధికారులపై మండిపడటం, ఉన్నతాధికారులను సైతం ఏకవచన ప్రయోగం చేయడం, పరుష పదజాలంతో నోటికొచ్చినట్టు మాట్లాడటం, బెదిరించడం ఆయన రాజకీయ జీవితంలో సర్వసాధారణమైపోయింది. అచ్చెన్నాయుడు వస్తే చాలు ఉద్యోగులు భయపడే పరిస్థితి నెలకొంది. ఇక, ఫోన్ బెదిరింపులైతే చెప్పనక్కర్లేదు. తన అనుయాయులకు పనిచేయకపోగా, చెప్పినట్టుగా అధికారులు నడుచుకోకపోయినా ఫోన్ చేసి తిట్టడం, దూషణలకు దిగడం అచ్చెన్నకు పరిపాటిగా మారిపోయింది.

పచ్చ పాపాలు- 7

ఉద్యోగులపై నిత్యం జులుం


టీడీపీ అధికారంలో ఉన్నంతకాలం ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులపైన జులుం ప్రదర్శించారు. ఎవరైనా జీ హుజూర్ అన్నట్టుగానే ఉండాలి. లేదంటే వారందరికీ శంకర గిరి మాన్యాలు పట్టిస్తానంటూ బెదిరింపులు చేసేవారు. చేయి చూపించి వార్నింగ్‌లు ఇచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. టీడీపీ ఓడిపోయాక కూడా ఆయన మదం తగ్గలేదు. నోటి కొచ్చినట్టు దూషణలకు దిగిన సందర్భాలు ఉన్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులనే కాకుండా పోలీసు అధికారులను బెదిరించారు. అచ్చెన్నాయుడు, కూన రవికుమార్‌లను చూసుకుని మిగతా టీడీపీ నాయకులు కూడా ఉద్యోగులపైన, అధికారులపైన విరుచుకుపడ్డ సందర్భాలు ఉన్నాయి.



ఆర్ అండ్ బీ ఉద్యోగి కళ్యాణి అనే మహిళపై అచ్చెన్నాయుడు మంత్రిగా ఉన్న సమయంలో దురుసుగా ప్రవర్తించారు. ఆమెపై దౌర్జన్యం చేశారు. దీంతో మనస్థాపానికి గురై ఆమె ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడింది.

గతంలో కోటబొమ్మాళి మండలం సౌడాం సమీపంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద మహిళా కానిస్టేబుల్‌పై అచ్చెన్నాయుడు దాడి చేసి, నీకు బట్టలు ఊడదీసి కొడితే దిక్కెవరే అంటూ బెదిరించాడు. ఆ సంఘటనను కప్పి పుచ్చేందుకు అప్పట్లో పోలీస్ అధికారులను బెదిరించి కంప్లైంట్ నమోదు కాకుండా చేశారు.

గతంలో పోలాకి మండలం రహీమానుపురంలో జన్మభూమి కమిటీ సభ్యుడు బాలక గోపి తండ్రి డెత్ సర్టిఫికెట్ విషయంలో పంచాయతీ కార్యదర్శి హనుమంతు త్రివేణి అక్కడ నిబంధనల మేరకు వ్యవహరించిందని నిమ్మాడ పిలిపించి ఆగ్రహించడంతో ఆమె అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయింది. హుటాహుటిన ఆస్పత్రికి తరలించడంతో ప్రమాదం తప్పింది.



గతంలో టెక్కలి ఎంపీడీఓ కార్యాలయంలోకి చొరబడి అప్పటి ఎంపీడీఓగా పనిచేసిన లోకనాథంను బెదిరించారు. చెప్పినట్టు చేయలేదన్న ఆగ్రహంతో తలుపులేసి తంతే నీకు దిక్కెవరు అని భయపెట్టారు.

బేరీజు వేసుకుంటున్న ఉద్యోగులు

ఇటు కింజరాపు అచ్చెన్నాయుడు, అటు కూన రవికుమార్ వ్యవహార శైలిపై ప్రభుత్వ ఉద్యోగులు గుర్రుగా ఉన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నంతకాలం అధికారులకు గానీ, ఉద్యోగులకు గానీ గౌరవం లేకుండా పోయిందని, అదే సంస్కృతిని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కొనసాగించారని ప్రభుత్వ ఉద్యోగులు విశ్లేషించుకుంటున్నారు. అధికారులపైన, ఉద్యోగులపైన జులుం ప్రదర్శించడంతో పాటు దూషణలు, బెదిరింపులకు దిగే టీడీపీ నాయకులెక్కడ, ఉద్యోగులను గౌరవించే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలకులెక్కడ అని బేరీజు వేసుకుంటున్నారు. ఎవరి హయాంలో ప్రశాంతంగా ఉద్యోగాలు చేసుకున్నామన్నదానిపై ఎన్నికల నేపథ్యంలో తేడాలు గమనించుకుంటున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసుకునే తరుణంలో ఎవరు బెస్ట్ అనే దానిపై పోల్చి చూసుకుంటున్నారు.

ఈవీఎంల కమిషనింగ్ ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలాని సమూన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈవీఎంలపై సీరియల్ నంబర్లు, అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన చిహ్నాల ఏర్పాటు సీసీ కెమెరాల ఎదుట పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి, ఈవీఎంల పనితీరు పరిశీలించి, వారికి పూర్తిస్థాయిలో నమ్మకాన్ని కలిగించాలని సూచించారు.

రెండో విడత ర్యాండమైజేషన్‌లో కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల నంబర్లను కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌లని ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించే ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం అక్కడే నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు.


ఓటు వేసిన పారామిలటరీ సైనికులు



ఛత్తీస్‌గఢ్‌లో సర్వీసు ఓటు వేసిన తర్వాత సిక్కోలు పారామిలటరీ సైనికుల ఉత్సాహం

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాకు చెందిన పారామిలటరీ సైనికులు తమ సర్వీసు ఓటును శుక్రవారం వినియోగించుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దుర్గ జిల్లా భిలాయి వద్ద పారామిలటరీ క్యాంపులో కమాండింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వీరు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటును పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో వేశారు. జిల్లాకు చెందిన 81 మంది పారామిలటరీ సైనికులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా.. వీరిలో 76 మంది ఆమదాలవలస, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు చెందిన అసెంబ్లీ అభ్యర్థులకు ఓటు వేశారు. 81 మంది శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థులకు ఓటు వేశారు. ఈ మేరకు పారామిలటరీ సైనికుడు పోలాకి మండలం ఖాన్‌సాహెబ్ పేటకు చెందిన కోట్ని లక్ష్మణరావు తెలిపారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్



శ్రీకాకుళం పాత బస్టాండ్: పోస్టల్ బ్యాలెట్లను శనివారం నుంచి స్వీకరించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. జిల్లాలో సుమారుగా 30,606 మంది ఎన్నికల విధుల్లో వివిధ కేడర్‌లలో పాల్గొంటున్నారని, వీరంతా వారికి కేటాయించిన షెడ్యూల్ ప్రాప్తికి ఓట్లను పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేసుకోవాలని ఆయన తెలిపారు. పీఓలు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్స్, హోం ఓటింగ్ ఇతర టీంలకు 4వ తేదీన, ఓపీఓలు, సెక్టార్ అధికారులు, ఇతర టీంలకు 5వ తేదీన, పోలీస్, ప్రైవేటు డ్రైవర్స్, ఆర్టీసీ డ్రైవర్స్, వీడియోగ్రాఫర్స్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, ఎక్స్‌సర్వీస్‌మెన్‌లకు 6వ తేదీన, జిల్లా స్థాయి అధికారులకు, ఇతర జిల్లాల్లో పనిచేసిన వారికి, హోం ఓటింగ్ పరిశీలకులకు 6వ తేదీన, రిజర్వ్ డే గా 7వ తేదీని కేటాయించారు. ఈ తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వేసుకోవాలని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలు

ఇచ్ఛాపురం	ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల
పలాస	ప్రభుత్వ హైస్కూల్, పలాస
టెక్కలి	ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి
పాతపట్నం	ఏపీ మోడల్ స్కూల్, పాతపట్నం
శ్రీకాకుళం	ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మెన్)
ఆమదాలవలస	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆమదాలవలస
ఎచ్చెర్ల	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పోలీస్ క్వార్టర్స్
నరసన్నపేట	ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసన్నపేట

శ్రీకాకుళం రిమ్స్‌ఆస్పత్రి రోడ్డులో బ్యాంకు వద్ద మండుటెండలో పింఛన్ దబ్బుల కోసం లైన్‌లో ఉన్న పింఛన్‌దారులు



చంద్రబాబు చిమ్మిన కాలకూటమి విషం

మండుటెండలో పండుటాకులు
రెండోరోజూ అవే కష్టాలు

'చంద్రబాబూ మా ఉసురు నీకు తగులుతుంది..' పింఛన్ డబ్బు తీసుకోవడానికి బ్యాంకుకు వచ్చిన ఓ వృద్ధుడి శాపమిది.

'బాబూ.. మాకు అన్యాయం చేయడం తగదు..'

బ్యాంకు క్యూలో నిలుచోలేక ఓ పింఛన్‌దారు వ్యక్తం చేసిన ఆవేదన ఇది. 'చంద్రబాబూ.. మమ్మల్ని బతకనీయవా..' ఎండలకు తట్టుకోలేక మరో పెన్షన్ లబ్ధిదారు సూటిగా వేసిన ప్రశ్న ఇది. చంద్రబాబు చిమ్మిన కాల'కూటమి' విషం పింఛన్‌దారులను నరకయాతన పెడుతోంది. వలంటీర్ల సేవలు వద్దంటూ మొదట ఆయనే తనవాళ్లతో ఫిర్యాదు చేయించారు, బ్యాంకు అకౌంట్లలో డబ్బులు వేయాలంటూ ఎన్నికల కమిషన్‌కు సిఫార్సులు చేశారు, ఇప్పుడు లబ్ధిదారులు అవస్థలు పడుతుంటే.. ప్రభుత్వమే ఇదంతా చేయించిందంటూ నీచ రాజకీయాలకు తెర లేపుతున్నారు. కానీ నిజం తెలిసిన జనాలు మాత్రం ప్రతి బ్యాంకు క్యూలోనూ చంద్రబాబు వైఖరిని దునుమాడుతున్నారు.





ఆమదాలవలస స్టేట్‌బ్యాంకు వద్ద వృద్ధురాలి ఇక్కట్లు

మమ్మల్ని బతకనివ్వరా..?

నాయనా చంద్రబాబు నాయుడా మాకు చివరి దశలో చుక్కలు చూపిస్తున్నావు. ఇలా మండుటెండలో బ్యాంకుల చుట్టూ దేకిరిస్తూ కాళ్లాడని నాలాంటివారి ఉసురు పోసుకుంటున్నావు. ప్రతి నెలా కదుపులో చల్ల కదలకుండా ఇంటికి పెన్షన్ తెచ్చి ఇచ్చేవారు. ఇదేం ఘోరం బాబూ...ఎవరికి అడిగినా నీ పుణ్యమే ఇది అంటున్నారు.

– కుప్పిలి రాములు, మర్రిపాడుకాలనీ, సవలాపురం, ఆమదాలవలస నియోజకవర్గం

మా ఉసురు చంద్రబాబుకి తగులుతుంది



పింఛన్ కోసం నా బోటి ముసలోళ్లను ఇన్ని ఇబ్బందులకు గురి చేసిన చంద్రబాబుకి మా ఉసురు తప్పకుండా తగులుతుంది. వలంటీరమ్మ ప్రతి నెల ఒకటో తారీఖు ఉదయం మా ఇంటికి వచ్చి రూ.3000 లు పింఛన్ డబ్బులు చేతికి అందించేది. ఇప్పుడు పింఛన్ కోసం గుబులుగా ఉంది. నడ్డి ఈడ్చుకుంటూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా. బాబు చేసిన పాపం మాకు శాపంగా మారింది. మా ఉసురు ఊరికినే పోదు.

– తమ్మినాన లక్ష్మమ్మ, పింఛన్ లబ్ధిదారు, వజ్రపుకొత్తూరు మండలం

చంద్రబాబు వల్లే ఈ పరిస్థితి



వలంటీర్ చక్కగా ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారేసరికి ఇంటికొచ్చి తలుపుకొట్టి పింఛన్ ఇచ్చేవాడు. ఇప్పుడెందుకు ఇవ్వడం లేదని అడిగితే చంద్రబాబు వలంటీర్లపై ఫిర్యాదు చేశాడట అందుకే ఇవ్వడం లేదని విన్నాను. మా లాంటి వృద్ధులకు ఈ రకంగా కష్టపెట్టడం న్యాయం కాదు. టీడీపీ వాళ్లకి మా ఉసురు తగులుతుంది.

– అంపోలు రామారావు, బుచ్చిపేట, శ్రీకాకుళం



టెక్కలి పాత జాతీయ రహదారి డివైడర్ వద్ద స్టేట్ బ్యాంక్ ఎదురుగా పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు

మూడు గంటలు నిలబడ్డాం



మండుటెండలో మూడు గంటల పాటు నిలబడ్డాం. అయినా పింఛన్ అందలేదు. బ్యాంకు పుస్తకాలు చూసి ఇస్తున్నారు. ఎండ అగ్నికుంపటిలా ఉంది. 75 ఏళ్ల వయస్సులో ఎందుకీ కష్టాలు పెడుతున్నారు. టీడీపీ ఫిర్యాదు చేయడం సరికాదు. కోపం ఉంటే ధనవంతుల మీద తీర్చుకుంటే బాగుంటుంది. నిరుపేదల మీద ఎందుకీ ప్రతాపం.

– సాధు రాజారావు, కుమ్మరివీధి, శ్రీకాకుళం.

ఎలా తీసుకోవాలో.. ఏమిటో..



మాది టెక్కలి మండలం లచ్చన్నపేట గ్రామం. ప్రతి నెల వలంటీర్లు మా ఇంటికే వచ్చి డబ్బులు ఇచ్చేవారు. ఇప్పుడు బ్యాంకులో వేశామని చెబుతున్నారు. ఎలా తీసుకోవాలో తెలీడం లేదు. ఇలాంటి కష్టాలు తెచ్చిపెట్టిన చంద్రబాబు బాగుపడడు.

– వై.అప్పారావు, వృద్ధుడు, లచ్చన్నపేట, టెక్కలి మండలం.

ఇది చంద్రబాబు పాపమే..



చంద్రబాబు చేసిన పనికి మాలాంటి వాళ్లకు ఇబ్బంది తప్పడం లేదు. ఈ ఎండల్లో బ్యాంకుల వద్ద ఎంత సేపు ఉండాలో తెలీడం లేదు. వలంటీర్లను తీయించి, ఇంటి వద్దకు పింఛన్ రాకుండా చేశారు. సచివాలయంలో ఇస్తున్న పింఛన్ ఇప్పుడు బ్యాంకులోకి వేస్తామంటున్నారు. మాలాంటి పింఛన్‌దారుల బాధ ఊరికే పోదు.

– బొమ్మాలి అప్పులమ్మ, సుభలయ, హిరమండలం మండలం

ఖాతా పనిచేయలేదు..



నా బ్యాంకు ఖాతా సక్రమంగా వినియోగించకపోవడంతో ఓపెన్ కాలేదు. దీంతో చాలా ఇబ్బంది పడ్డాను. ఏవో కాగితాలు తీసుకువచ్చి ఇస్తే అప్పుడు ఖాతా పనిచేసింది. వలంటీర్లు ఉంటే ఈ కష్టం ఉండేది కాదు. చంద్రబాబు వల్లే ఇదంతా జరిగింది.

– కాగితపల్లి దాలినాయుడు, లబ్బ గ్రామం, కొత్తూరు మండలం



కొత్తూరులోని బ్యాంకులో బారులు తీరిన పింఛన్‌దారులు

క్లుప్తంగా

పకడ్బందీగా స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాట్లు



అంతర్గత రోడ్లు, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఎచ్చెర్ల క్యాంపస్ : స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు, ఎచ్చెర్ల నియోజకవర్గం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల ఈవీఎంల స్వీకరణ కేంద్రాల ఏర్పాట్లు సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 13న పోలింగ్ ముగిశాక జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల ఈవీఎంలను ఇక్కడే భద్రపరచనున్నారు. ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా బస్సుల పార్కింగ్, అంతర్గత రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. కాగా, శివానీ కాలేజీలోనే రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం అద్దె క్యాంపస్ కొనసాగుతుండటంతో విద్యార్థులను ఎస్ఎంపురం ప్రధాన క్యాంపస్‌కు తరలించారు.

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ఏసీ రిఫ్రిజిరేషన్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న శిక్షణ ప్రారంభమవుతుందని, 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగి 10వ తరగతి విద్యార్హత కలిగిన యువకులు అర్హులని చెప్పారు. ఈ నెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 95534 10809, 79933 40407 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గడ్డివాము దగ్ధం



కాలిపోతున్న గడ్డి

బూర్జ: మండలంలోని టీఆర్ రాజుపేటలో లావేటి బలరాజు(పెద్దయ్య)కు చెందిన సుమారు 15 ఎకరాల గడ్డి వాము శుక్రవారం మధ్యాహ్నం దగ్ధమైంది. ప్రమాదానికి గల కారణం తెలియలేదు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. అదే విధంగా, గురువారం అర్ధరాత్రి లచ్చయ్యపేటలో రైతులు గిరడ అప్పలనాయుడు, కొంచాడ స్వామినాయుడు, కింతలి కిరణ్‌కుమార్, రాయపురెడ్డి సింహాద్రిలకు చెందిన 10 ఎకరాల నీలగిరి తోటలు కూడా అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి.

రోడ్డుపై కుప్పకూలి ఉపాధ్యాయుడు మృతి



ఘటనా స్థలంలో షణ్ముఖరావు

కాశీబుగ్గ: రోడ్డుపై కుప్పకూలి గాయపడిన ఘటనలో మందస గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఎ.షణ్ముఖరావు(44) శుక్రవారం మృతిచెందారు. గురువారం బైక్‌పై వెళ్తుండగా జాతీయ రహదారిపై ఒక్కసారిగా కుప్పకూలి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు సమీపంలోని హరిపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యసేవలు అందించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. షణ్ముఖరావు వడదెబ్బకు గురై కుప్పకూలి ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. ఈయన పలాస మండలం శాసనాం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళకు గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో మెళియాపుట్టి వెళ్లే దారిలో రైస్ మిల్లులో పనిచేస్తున్న మహిళ శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాల పాలైంది. మండాపాలెం కాలనీకి చెందిన పోలాకి సుందరమ్మ మిల్లు ఆవరణలో ఊక శుభ్రం చేస్తుండగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదవశాత్తు తగలడంతో షాక్‌కు గురైంది. వెంటనే తోటి సిబ్బంది టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

జమ్ములో దొంగలు హల్‌చల్

నరసన్నపేట: మండలం జమ్ములో శుక్రవారం వేకువజామున దొంగలు హల్‌చల్ సృష్టించారు. గ్రామానికి చెందిన వాన శిరీషా మెడలో మూడున్నర తులాల పుస్తెలతాడును తెంచుకుపోయారు. సాధు లచ్చయ్య ఇంట్లో దొంగతనానికి ప్రయత్నించారు. గ్రామస్తుల కేకలు విని పరారయ్యారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు శిరీషా తండ్రి సింహాచలం తెలిపారు.

అమ్మో.. ఆ పార్టీలా!



వైఎస్సార్ సీపీలో చేరిన జాడుపూడి కాలనీ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్

- ఇచ్ఛాపురంలో టీడీపీ, జనసేనలను వీడుతున్న పార్టీ శ్రేణులు
- వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన బసవకొత్తూరు, బసవపుట్టుగ గ్రామస్తులతో ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీలకు భారీ ఎదురుదెబ్బ తగులుతోంది. ఆ పార్టీల్లో ఇమడలేమంటూ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బయటకు వచ్చేసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. మొదటి నుంచి టీడీపీకి కంచుకోటగా ఉన్న గ్రామాలు సైతం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి పిరియా విజయ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. దాదాపు ప్రతిరోజూ చేరికలు వెల్లువలా సాగుతుండటంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది.

ఇటీవల చేరికలు..

- ఇచ్ఛాపురం మున్సిపాల్టీ పరిధిలో 1, 2, 3 వార్డుల నుంచి టీడీపీ మాజీ కౌన్సిలర్ సాలిన రేవతి, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు సాలిన మామయ్య, జనసేన నుంచి బొండాడ మహేష్‌తో పాటు 60 కుటుంబాలు, విశ్వబ్రాహ్మణ సంఘం నుంచి 150 కుటుంబాలు, మాజీ కౌన్సిలర్ రేణుకా రాణి పాత్రోతో పాటు 100 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు.
- గత ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన బోర తులసీరావుతో పాటు 200 కుటుంబాలు, 4వ వార్డులో 160 కుటుంబాలు, మరో 700 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి.
- కవిటి మండలం ఆర్.బెలగాం పంచాయతీ బసవకొత్తూరు, కంచిలి మండలం జాడుపూడి పంచాయతీ బసవపుట్టుగలో కుటుంబాలు 600 కుటుంబాలు, జాడుపూడి కాలనీ నుంచి వివిధ సామాజిక వర్గాలకు చెందిన 500 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ కండువాలు ధరించారు.

గుర్తింపు లేకే..

టీడీపీలో ఎన్ని సంవత్సరాలుగా ఉంటున్నా సరైన గుర్తింపు లేకపోవడంతో కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్‌సీపీ వైపు చూస్తున్నారు. ఓ వైపు జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, మరోవైపు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు పార్టీ కార్యకర్తలు తలెత్తుకొనేలా ఉంటున్నాయని టీడీపీ శ్రేణులు బాహాటంగా అంటున్నారు. ఇలాంటి పార్టీలోనే తమకు గౌరవం ఉంటుందని స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారు. మీ ఇంట్లో మంచి జరిగినట్లు భావిస్తేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ముఖ్యమంత్రి ఇస్తున్న పిలుపునకు స్పందించి, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని పిరియా విజయపై ఉన్న అభిమానంతో రోజూ పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు.

- నరసన్నముకుందాపురం నుంచి 70 కుటుంబాలు, జె.శాసనాం నుంచి 20 కుటుంబాలు, కత్తివరం నుంచి 50 కుటుంబాలు జనసేనను వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి.
- కుంబరినౌగాం పంచాయతీ పరిధి సింగుపురం, సుంకిలి గ్రామాలకు చెందిన సుమారు 40 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు.
- సోంపేట పట్టణంలో డాబాకాలనీ కి చెందిన సీనియర్ వార్డు మెంబర్ పండి సింహాచలం, మేస్త్రి సంఘం నుంచి రెల్ల కుమార్, ట్రాక్టర్ యూనియన్ నుంచి రెల్ల లక్ష్మీనారాయణ తదితర 400 కుటుంబాలు, బారువ నుంచి 150 కుటుంబాలు, సిరిమామిడి, కొర్లాం, తాళభద్ర తదితర గ్రామాల నుంచి 300 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి.



జె.శాసనాంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ



ఇచ్ఛాపురం 3వ వార్డులో జనసేన పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో నర్తు రామారావు, పిరియా సాయిరాజ్

ఖాన్‌సాహెబ్‌పేటపై కాకమ్మ కథలు!

- ఎల్లోమీడియా అవాస్తవ రాతలపై గ్రామస్తుల మండిపాటు



తాగునీటి బోరు బాగు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పోలాకి: ఖాన్‌సాహెబ్‌పేట.. మబగాం పంచాయతీలోని అనుబంధ గ్రామం. ఇక్కడి ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మద్దతుదారులు. ప్రభుత్వంపై వీరికి వ్యతిరేక భావం కలిగించాలన్న ఉద్దేశంతో కొంతమంది ఎల్లోమీడియా సహకారంతో గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉందంటూ కాకమ్మకథలు ప్రచారం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఎల్లోమీడియా తీరుపై మండిపడ్డారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న రెండు తాగునీటి బోర్లలో ఒకటి 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధర్మాన కృష్ణదాస్ వేశారని, రెండోది అతను తొలిసారి ఎమ్మెల్యేగా అయినప్పుడు వేయించినదని గుర్తు చేశారు. నిజంగా టీడీపీ వారికి అంతప్రేమ ఉంటే 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న రమణమూర్తి ఎందుకు పట్టించుకోలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, సాగు అవసరాలకు నీటి మళ్లింపు తదితర కారణాలతో తాగునీటికి ఇబ్బంది ఏర్పడిందని, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారని గ్రామానికి చెందిన త్యాగరాజు తెలిపారు.

బుడగుట్లపాలెం హార్బర్‌తో వలసల నివారణ



పనులు పరిశీలిస్తున్న మత్స్యకారుల నాయకుల బృందం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన మత్స్యకార నాయకుల బృందం శుక్రవారం బుడగుట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించారు. నిర్మాణ పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. హార్బర్ అందుబాటులోకి వస్తే మత్స్యకారుల వలసలు శాశ్వతంగా తగ్గుతాయని చెప్పారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు మత్స్యకారులు సంక్షేమం విస్మరించారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలోనే 10 హార్బర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం గొప్ప విషయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి సీదిరి అప్పలరాజు మత్స్యకారులు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది మూగి గురుమూర్తి, పాపయ్య, లక్ష్మణ్, సూర్యనారాయణ, రామారావు, సింహాచలం, సురేష్, అనిల్ ఉన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ పోలీసులు

రణస్థలం: మండలంలోని పోతయ్యపేట, భీమునిపాలెం గ్రామాలకు చెందిన మైలపల్లి అప్పయ్యమ్మ, కరణం పాపారావులు అక్రమంగా విక్రయిస్తున్న 31 మద్యం బాటిళ్లను రణస్థలం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్సై రవిప్రసాద్ స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మత్స్యకార ప్రాంతంలో ఎస్ఈబీ పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో పట్టుబడిన మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

బూరగాంలో..

టెక్కలి రూరల్: మండలంలోని బూరగాం గ్రామానికి చెందిన పట్నాన వెంకటరమణ అక్రమంగా మద్యం తరలిస్తున్నాడనే సమాచారం మేరకు టెక్కలి ఎస్ఈబీ సీఐ జి.ఎస్.రాజశేఖర్‌నాయుడు తన సిబ్బందితో కలిసి శుక్రవారం టెక్కలిలో తనిఖీలు చేపట్టారు. వెంకటరమణ వద్ద సుమారు 50 మద్యం బాటిళ్లు గుర్తించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ అధికారులు తెలిపారు.



కవిటి: జగతిలో పార్టీలో చేరినవారితో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్

వైఎస్సార్ సీపీతోనే మా ప్రయాణం



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- పార్టీలోకి కొనసాగుతున్న చేరికలు
- కండువాలు వేసి ఆహ్వానిస్తున్న నాయకులు

కవిటి : రాష్ట్రంలో ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిన పారదర్శకత, పాలనా దక్షతలను చూసి జిల్లాలో ఎక్కడకు వెళ్లినా మా నమ్మకం నువ్వే జగన్ అంటూ జిల్లా వాసులు అభిమానాన్ని చాటుకుంటున్నారని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. కవిటి మండలం జగతి సచివాలయం పరిధిలో 40 కుటుంబాల వారు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ తిలక్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, నర్తు నరేంద్రయాదవ్, సీడాప్ ఛైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, దుక్క లోకేశ్వరరెడ్డి, కడియాల ప్రకాష్, వై.నీలయ్య, పి.నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

- పాతపట్నం: ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో హిరమండలం మండలంలోని మహాలక్ష్మీపురం గ్రామానికి చెందిన 200 కుటుంబాలు, సుభలయి ఆర్.ఆర్.కాలనీకు చెందిన 12 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. పాతపట్నంలోని క్యాంపు కార్యాలయంలో వీరికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మహాలక్ష్మీపురం గ్రామానికి చెందిన రెడ్డి శ్రీను, ఎల్లంకి శ్రీను, గిరిజన నాయకుడు బొంతు నారాయణ, వార్డు మెంబర్ తూములు గజ్జమ్మ, మాజీ సర్పంచ్ సుండి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బి.నారాయణ, కరణం గిరిబాబు, ఎర్లంకి మనోజ్, పడాల వెంకటరమణ, కె.మొఖలింగం, సుభలయి ఆర్ఆర్‌కు చెందిన టీడీపీ నాయకుడు పతివాడ వెంకటరమణ, బలగ వెంకటరమణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రామకృష్ణ పాల్గొన్నారు.
- పాతపట్నం: కొత్తూరు మండలం ఇరపాడు గూడకు చెందిన 50 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి వీరికి కండువాలు వేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ సూర్యనారాయణ, పంకజ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.
- రణస్థలం: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జి.సిగడాం మండలం ఆనందపురం పంచాయతీ ఆబోతులపేటలో టీడీపీకి చెందిన 15 కుటుంబాలు, లావేరు మండలం గోవిందపురం పంచాయతీ ఇజ్జాడపాలెంలో 19 కుటుంబాలు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఆబోతుల శ్రీను, లోలుగు చంటి, జగ్గురోతు సోమినాయుడు, జగ్గరోతు చంద్రరావు, బూరాడ చిన్నారావు, లోలుగు రాము, ఇజ్జాడ ధర్మారావు, చిన్నప్పడు, సత్యం, వెంకటేష్, శ్రీను, మాలచ్చి, పతివాడ సీతంనాయుడు, సన్యాసినాయుడు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఆనందపురం సర్పంచ్ ప్రతినిధి చిత్రి మోహన్, లావేరు జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, ఏపీసీఎస్ ఛైర్మన్ బూరాడ చిన్నారావు, గోవిందపురం ఎంపీటీసీ సభ్యుడు ఇజ్జాడ రాము, నాయకులు పతివాడ గంగునాయుడు, ఇజ్జాడ నందన్న తదితరులు పాల్గొన్నారు.
- సారవకోట: మండలంలోని పెద్దగుజ్జువాడ, కూర్మనాథపురం గ్రామాలకు చెందిన 20 కుటుంబాల వారు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలోచేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ధర్మాన రామలింగంనాయుడు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వరుదు దేవీప్రసాద్, చిన్నాల లక్ష్మీనారాయణనాయుడు, పీఏసీఎస్ ఛైర్మన్ గెల్లంకి వెంకటరావు, సర్పంచ్‌లు బాబూరావు, సాధు సతీష్, షణ్ముఖరావు, నాయకులు పోలాకి కేశవరావు, చంద్రరావు, బుడ్డు కేశవరావు, కోన భీమారావు, గొర్లె డిల్లీరావు, సురవరపు రమేష్, పోలాకి రాము, రావాడ శ్రీనివాసరావు, వెలమల సింహాచలం, కాళ్ళ సింహాచలం పాల్గొన్నారు.



రణస్థలం: వైఎస్సార్‌సీపీలో చేరిన ఆబోతులపేట టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



రణస్థలం: వైఎస్సార్‌సీపీలో చేరిన ఇజ్జాడ పాలెం టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కిరణ్



పాతపట్నం: పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం: ఇరపాడుగూడ కార్యకర్తలకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పెళ్లి కావడం లేదని యువకుడు ఆత్మహత్య



సాయికోటి (ఫైల్)

రణస్థలం: లావేరు మండలం తాళ్లవలస గ్రామానికి చెందిన ముంగం సాయికోటి(26) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జె.ఆర్.పురం పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లగేజీ ఆటో నడుపుతున్న సాయికోటికి ఇటీవల నాలుగు పెళ్లి సంబంధాలు చూశారు. అయినా పెళ్లి కుదరకపోవడంతో గురువారం మధ్యాహ్నం రణస్థలం మండలం బంటుపల్లి సమీపంలో రాధాగోవింద మందిరం సమీపంలో పురుగుల మందు తాగాడు. ఈ విషయం పెద్దక్కకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే బావ ఈశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని 108 అంబులెన్సులో రణస్థలం సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 10గంటల సమయంలో మృతి చెందాడు. తండ్రి శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జే.ఆర్.పురం ఏఎస్సై లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడితోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



చెట్టుకు వేలాడుతున్న వ్యక్తి మృతదేహం

ఇచ్ఛాపురం రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మామిడి చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించిన ఘటన శుక్రవారం ఇచ్ఛాపురం మండలంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ ఎస్.లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. లొద్దపుట్టి సమీపంలోని మామిడి చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందడంతో స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకొని విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలియపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కూరగాయలు తీసుకొస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నందిగాం మధు మృతదేహం

మెళియాపుట్టి : మండలంలోని చీపురుపల్లి గ్రామానికి చెందిన నందిగాం మధు (42) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మధు గురువారం సాయంత్రం పలాస మండలం టెక్కలి పట్నం కూరగాయలు తీసుకురావడానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా పెద్దమడి నుంచి పలాస వైపు వెళ్తున్న బీహార్‌కు చెందిన యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో మధుకు తీవ్ర గాయాలు కావడంతో 108లో టెక్కలి జిల్లా ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. మధు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్ కేసు నమోదు చేశారు. శుక్రవారం పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం చీపురుపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. మధుకు భార్యమాధురి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.


రైల్వేగేటును ఢీకొన్న ఆర్టీసీ బస్సు



రైల్వే గేటును సరిచేస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: స్థానిక తెంబూరు రోడ్డులో రైల్వే గేటును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గుణుపూర్ నుంచి విశాఖపట్నం రైలు వస్తుందన్న సమాచారం మేరకు గేటుమేన్ గేట్ వేస్తుండగా పలాస నుంచి టెక్కలి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు రెండో గేటు దాటుతున్న సమయంలో పైనున్న ఇనుప క్యారేజీకి తగిలింది. గేటు వంగి బస్సుపై పడిపోయింది. అనంతరం స్థానికుల సహాయంతో గేటును పక్కకు తొలగించారు.

బగ్గు వారి అవినీతి కథలు



అనుకోని విధంగా ఐదేళ్లు అధికారం దక్కింది. ఇంకేముంది.. కాలువల నుంచి కాంట్రాక్టుల వరకు, కొలువుల నుంచి బదిలీల వరకు, ఇసుక నుంచి నీరు–చెట్టు వరకు ఇష్టానుసారంగా అవినీతికి పాల్పడ్డారు. 'బగ్గు' వారి అవినీతి బాగోతాలు ఇప్పటికీ నరసన్నపేటలో కథలు కథలుగా చెప్పుకుంటూ ఉంటారు. ఐదేళ్ల కాలంలో కోట్లకు పడగలెత్తిన బగ్గు రమణమూర్తి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో నరసన్నపేట వాసులను దారుణంగా మోసం చేసిన ఘటన ఇంకా ఎవరూ మరువలేదు. అందుకే కబ్జాలు, కమీషన్లు, నాసిరకం పనులతో ధనార్జనే ధ్యేయంగా ఐదేళ్లు గడిపిన 'బగ్గు'ను నియోజకవర్గ ప్రజలు 2019లో కుర్చీ నుంచి దించేశారు.



సారవకోట మండలం జగ్గ చెరువులో పొక్లెయినర్‌తో నీరు చెట్టు పనులు (ఫైల్)



వీరన్నాయుడు కాలనీ వద్ద పైపుల్లో నుంచి బయటకు వచ్చిన మురుగు నీరు (ఫైల్)

సాక్షి, నెట్‌వర్క్: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తిత్లీ పరిహారంలో చేతివాటం, కాలువల పూడికల తీతలో కమీషన్లు, అధికారులకు అక్రమంగా బదిలీలు, అంగన్‌వాడీ పోస్టుల్లో అక్రమాలు.. బగ్గు రమణమూర్తి లీలలు అన్నీ ఇన్నీ కావు. తన పదవిని అడ్డుపెట్టుకొని 2014–19 మధ్య కాలంలో నరసన్నపేట కేంద్రంగా ఆయన కోట్లకు పడగలెత్తారు. అప్పట్లో ఏకంగా లోకేష్‌తో నేరుగా సంబంధాలు పెట్టుకొని పెద్ద వ్యవహారాలే నడిపారనే విమర్శలు ఉన్నాయి.

తెలుగు తమ్ముళ్లకే రైతు రథాలు

అప్పట్లో రైతు రథం పేరిట టీడీపీ ప్రభుత్వం రైతులకు ట్రాక్టర్లు అందజేసే నెపంతో తన కార్యకర్తలకు అందజేసింది. శ్రీకాకుళంలో రఘురాం ఆగ్రో ఇండస్ట్రీస్ పేరున ఉన్న వ్యవసాయ పరికరాల షోరూం నుంచి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు పంపిణీ చేశారు. దీంట్లో రమణమూర్తి స్లీపింగ్ పార్టనర్‌గా ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి.

తిత్లీ పరిహారంలోనూ..

తిత్లీ నష్ట పరిహారాన్ని కూడా బగ్గు వదల్లేదు. సారవకోట మండలంలో గిరిజనుల పంట పాడైపోతే ఒక్కరికి కూడా పరిహారం అందించలేదు. టీడీపీ నాయకుల సూచనతో తక్కువ భూమి ఉన్న స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అధిక నష్ట పరిహారం పొందారు.



మండల జన్మభూమి కమిటీ అధ్యక్షుడు బగ్గు గోవిందరావు చేపట్టిన దోమనాపల్లి రోడ్డు(ఫైల్)

అంగన్‌వాడీ పోస్టుల్లోనూ..

సారవకోట మండలంలో న్యూట్రిషన్ కౌన్సిలర్, పోలాకి, జలుమూరు మండలాల్లో అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులు మంజూరులోనూ అప్పట్లో చేతివాటం చూపించారు. లాటరీ వేసి కొలువు ఇచ్చిన దాఖలాలు కూడా ఉన్నాయి. అప్పట్లో ఈ పోస్టులు పొందిన ప్రతి ఒక్క న్యూట్రిషన్ కౌన్సిలర్ నుంచి రూ. 50 వేల నుంచి రూ.80 వేలు వరకూ ఆయా గ్రామాల జన్మభూమి కమిటీ సభ్యులు తీసుకున్నారు. కానీ వీరిని ఆరు నెలలు మాత్రమే కొనసాగించారు.

అష్టతీర్థాల పేరుతో శఠగోపం

శ్రీముఖలింగం ఆలయాన్ని కూడా ఆయన వదల్లేదు. 2018 జూలై 31 నుంచి ఆగస్టు 7 వరకూ జరిగిన అష్టతీర్థ రాజమహాయోగంలో తీర్థాల అభివృద్ధి పేరిట రూ. 45 లక్షలు టీడీపీ నాయకులు దోచుకున్నారు. పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు.

బినామీల పేరిట..

టీడీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు బగ్గు రమణమూర్తి తన అనుచరులను బినామీలుగా చేసుకుని నియోజకవర్గ వ్యాప్తంగా అవినీతి బాగోతాలు నడిపారు. నీరు–చెట్టు, అంగన్‌వాడీ భవనాలు, శ్మశానాల అభివృద్ధి వంటి పనులను కూడా వదలకుండా ప్రతి పనిలోనూ 15 నుంచి 25 శాతం వాటా అందుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కేవలం బినామీల నుంచే రూ.15 కోట్ల వరకు గడించారని కూడా అంటారు.

కాలువల పేరుతో..

నరసన్నపేట మేజరు పంచాయతీలో భూగర్భ డ్రైనేజీ పేరిట ఆయన చేసిన మోసం ఇప్పటికీ ఎవరూ మరువలేదు. దీని నిర్మాణానికి ప్రభుత్వం చేత రూ. 7 కోట్లు తన కుమారుడికి చెందిన 'సుప్రీం' కంపెనీకి మంజూరు చేయించుకున్నారు. ఆ నిధులు సరిపోవని చెప్పి సర్వేలు చేయించి ఉపాధి నిధులు మరో రూ.15 కోట్లు మంజూరు చేయించారు. ఇన్ని డబ్బులు మంజూరు చేశాక కాగితాలు తప్ప పనులేవీ కనిపించలేదు.



వనిత మండలం వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపులో బారులు తీరిన ట్రాక్టర్లు(ఫైల్)

ఇసుక దందా

నరసన్నపేట, జలుమూరు, పోలాకి మండలాల్లో వంశధార నదికి ఆనుకొని ఉన్న ఇసుక అప్పట్లో టీడీపీ శ్రేణులకు బంగారం బాతుగా మారింది. ఇసుక ర్యాంపుల్లో బగ్గు రమణమూర్తి పెద్ద ఎత్తున ఆర్జించినట్లు అంతా చెప్పుకుంటూ ఉంటారు. 2016లో ఆర్డీఓ దయానిధి, డీఎస్పీ భార్గవనాయుడు, అప్పటి మైన్స్ ఏడీలు లుకలాం మాజీ సర్పంచ్ సూర్యనారాయణపై కేసు నమోదు చేసేందుకు ప్రయత్నించగా రమణమూర్తి అడ్డుకోవడం అందరికీ తెలుసు.

ఇంకొన్ని..

- బగ్గు రమణమూర్తి సోదరుడు బగ్గు గోవిందరావు ఐదేళ్ల ఆడిందే ఆట పాడిందే పాటగా సాగింది.
- జలుమూరు మండలంలో జన్మభూమి కమిటీ సభ్యుడిగా ఉన్న ఈయన వంశధార ప్రధాన ఎడమ కాలువలో పూడిక తీతకు రూ.95 లక్షలు మంజూరు చేయించుకుని 20 శాతం పనులు కూడా చేయకుండా డబ్బులు జేబులో వేసుకున్నారు.
- నరసన్నపేట డీఈఈ శేఖరరావు స్థానంలో నీరు చెట్టు బిల్లులు చేయించడానికి మరో అధికారిని తెప్పించుకున్నారు. నీరు–చెట్టు నాసిరకం పనులతో నిధులు కాజేశారు.
- పోలాకి మండలంలోని ఉప్పుగెడ్డ దాని అనుసంధాన కాలువల విస్తరణ పనుల్లో అవినీతి వరద పారింది. జల వనరులశాఖ నుంచి రూ.12.12కోట్లు నిధులు ఖర్చు చేసినా ఆ పనులేవీ కనిపించలేదు. కేవలం రెండు ప్రొక్లెయిన్‌లతో మట్టిపనులు చేసి మమ అనిపించారు.
- కరకవలస–బైదిలాపురం, బైదిలాపురం నుంచి ఎస్టీ మాకివలస, నగిరికటకం, బైరాగిపేటలకు రూ. 4 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టి లక్షలాది రూపాయలు అవినీతికి పాల్పడ్డారు. ఈ విషయంపై జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పట్లో ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యేగా ఉన్న రమణ మూర్తితో ఫోన్ చేయించి కేసును రాజీ చేశారు.
- దేవాది, ఉర్లాం సబ్‌స్టేషన్లలో కూడా షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులను అమ్ముకున్నారు.
- నరసన్నపేట టౌన్‌లో టీడీపీ నాయకులు రోడ్డు మీద రోడ్లు వేసి పంచాయతీలో ఉన్న జనరల్ ఫండ్‌తోపాటు ఇతర ప్రభుత్వ నిధులు కొల్లగొట్టారు.
- సారవకోట మండలం బొంతు ఎత్తిపోతల పథకంలో కూడా బినామీ పేరుతో డబ్బులు కొట్టేశారు.
- నరసన్నపేటలో పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు టీడీపీ కార్యకర్తలకు కట్టబెట్టారు.

క్లుప్తంగా

పరిశోధనలకు ప్రాధాన్యత



మాట్లాడుతున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశోధనలే లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం వైస్‌చాన్సలర్ కేఆర్ రజిని అన్నారు. అధ్యాపకులతో వీసీ కార్యాలయంలో శనివారం త్వరలో ప్రారంభించనున్న ఎ మల్టీ డిసిప్లయినరీ ఇంటర్నేషనల్ జర్నల్స్ పై చర్చించారు. ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్, లా వంటి కోర్సుల్లో పరిశోధనలు పెరగాలని సూచించారు. మూడు నెలలకు ఒకసారి జర్నల్స్ వర్సిటీలో ప్రచురించనున్నట్లు చెప్పారు. వర్సిటీలో ఏర్పాటు చేయనున్న రీసెర్చ్ ఫోరానికి పరిశోధకులు, మేధావులు, విద్యావేత్తలను ఆహ్వానించాలని సూచించారు.

మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్



మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తున్న సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైమ్ : ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్ల తల్లిదండ్రులకు శ్రీకాకుళం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ సీఐ అవతారం ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేసి మైనర్లను ఆపి ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున జరిమానాగా కట్టించారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ చేశారు. వారికి వాహనాలు ఇస్తే ప్రమాదాలకు మీరే బాధ్యులవుతారని హెచ్చరించారు.

శబ్దం హద్దు మీరితే కేసులే

హిరమండలం: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ప్రచారం కోసం ప్రత్యేకంగా రూపొందించుకున్న పాటలతో ఊళ్లన్నీ మార్మోగుతున్నాయి. అయితే ప్రచార శబ్దానికీ ఓ పరిమితి ఉంది. కాలనీల్లోని నివాస ప్రాంతాల్లో 45–50 డెసిబుల్స్ ఉండాలి. విద్యాలయాల పరిధిలో 40–50 ఉండాలి. వ్యాపార సముదాయాల వద్ద 55–65, పారిశ్రామిక ప్రాంతాల్లో 70–75 డెసిబుల్స్ శబ్దం మాత్రమే ఉండాలి. వీటిని ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది.

రోడ్డు ప్రమాదంలో మెడికల్ విద్యార్థి మృతి

- మరో ఇద్దరి పరిస్థితి విషమం

మల్కాపురం (విశాఖ జిల్లా): ఎన్నో ఆశలు.. భవిష్యత్‌లో వైద్యులుగా స్థిరపడాలని ఎన్నో కలలు గన్నారు. చదువుల కోసం జిల్లాలు దాటి విశాఖ వచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. వివరాలు ఇలా.. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల ప్రాంతానికి చెందిన షేక్‌జానీ, అనంతపురం ప్రాంతానికి చెందిన సత్యకుమార్, శ్రీకాకుళానికి చెందిన ప్రమోద్‌లు కొమ్మాదిలోని గాయత్రి మెడికల్ కళాశాలలో మెడిసిన్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. ఈ ముగ్గురు ఒకే ద్విచక్రవాహనంపై యారాడ, గంగవరం బీచ్‌కు శుక్రవారం తెల్లవారుజామున బయలుదేరారు. మల్కాపురం పోలీసు స్టేషన్ రోడ్డు నుంచి సింథియా వైపు వెళుతుండగా షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్ సమీపంలో ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ సంఘటనలో షేక్‌జానీ అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. సత్యకుమార్, ప్రమోద్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో డివైడర్ పనులు జరుగుతున్నాయి.

తవ్విన వ్యర్థాలను తరలించేందుకు అక్కడకు ట్రాక్టర్ వచ్చింది. ఇది గుర్తించలేని యువకులు ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని కేజీహెచ్‌లో చేర్పించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది. షేక్‌జానీ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. జరిగిన సంఘటనపై విచారణ జరుపుతున్నామని మల్కాపురం ఇన్‌చార్జ్ సీఐ దాశరథి చెప్పారు.



ఘటనా స్థలంలో షేక్‌జానీ మృతదేహం

మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు



ఘాటీముకుందాపురం చెక్‌పోస్టును పరిశీలిస్తున్న గంగాధరం

కంచిలి: ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, ఇతర మాదక ద్రవ్యాలను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ డి.గంగాధరం పేర్కొన్నారు. చెక్‌పోస్టులలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కంచిలి మండలంలోని ఘాటిముకుందాపురం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్దకు శుక్రవారం సాయంత్రం ఆయన వచ్చారు. అక్కడ చేపడుతున్న వాహనాల తనిఖీలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ పర్యటనలో ఆయనతోపాటు సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఆర్.జైభీమ్, మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఉద్యోగులపై కూన వైఖరి సరికాదు'



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస: ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం ఆమదాలవలస టీడీపీ అభ్యర్థి కూన రవి కుమార్‌కు తగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. ఆమదాలవలస స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఉద్యోగుల సమస్యలను ఎన్నో పరిష్కరించిందని తెలిపారు. అందుకే పలు ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వంపై నమ్మకం వెలిబుచ్చారని, వారిపై కూన రవి కుమార్ కక్షసాధింపులకు దిగడం సరికాదని అన్నారు. నాలుగున్నర దశాబ్దాల కాలంలో ప్రభుత్వ ఉద్యోగులపై తప్పుడు ఫిర్యాదులు వంటి చర్యలకు ఇప్పటివరకు ఏ ఒక్క రాజకీయ నాయకులు పాల్పడలేదన్నారు. తమ్మినేని, బొడ్డేపల్లి వంశీయులు ఆమదాలవలస నియోజకవర్గానికి గుర్తింపు, గౌరవం తీసుకువచ్చారన్నారు. కానీ కూన రవికుమార్ ప్రభుత్వ ఉద్యోగులను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఇలాంటి విపరీత ధోరణి మార్చుకోవాలని ఆయన సూచించారు. లేకుంటే ఉద్యోగులు సరైన గుణపాఠం చెబుతారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు వైఎస్ జగన్ సర్కారుకు మద్దతుగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

అరచేతిలో అభ్యర్థి సమాచారం

హిరమండలం:

2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతోంది. జిల్లాలో 8 నియోజకవర్గాల నుంచి పోటీ చేసే అభ్యర్థుల పూర్తి వివరాలను తెలుసుకోవాలనే ఉత్సాహం ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అభ్యర్థి స్థిర,చరాస్తులు, కుటుంబ వివరాలు, క్రిమినల్ కేసులు తదితర వివరాల్ని తెలుసుకునే వీలును ఎన్నికల సంఘం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. 'నో యువర్ క్యాండిడేట్(కేవైసీ')' పేరుతో అప్లికేషన్‌ను అందుబాటులో ఉంచింది. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు ప్లేస్టోర్‌లో యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని అభ్యర్థి వ్యక్తిగత వివరాలతో పాటు క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్‌ను తెలుసుకోవచ్చు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే సందర్భంలో సమర్పించే అఫిడవిట్ వివరాలను వెంటనే సంబంధిత అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన రోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దాఖలైన నామినేషన్‌ల వివరాలు యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులు ప్లేస్టోర్‌కు వెళ్లి నో యువర్ క్యాండిడేట్ యాప్ డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ పూర్తయిన తర్వాత ఓపెన్ చేయగానే ప్రొసీడ్ ఆప్షన్ డిస్ ప్లే అవుతుంది. యాప్‌లోకి వెళ్లాక సెలక్ట్ క్రైటీరియా ఆప్షన్ చూపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. అందులోకి వెళ్లి, పార్లమెంట్ నియోజకవర్గం ఏ సంవత్సరానికి సంబంధించిన వివరాలు కావాలో ఆ ఇయర్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. స్టేట్, నియోజకవర్గ వివరాలను సెలెక్ట్ చేసి సబ్మిట్ చేయగానే ఆ నియోజకవర్గంలో ఎవరెవరు నామినేషన్ దాఖలు చేశారో వివరాలు డిస్‌ప్లే అవుతాయి. అందులో మనం తెలుసుకోవాల్సిన అభ్యర్థిపై క్లిక్ చేస్తే ఆయన సమర్పించిన అఫిడవిట్ వస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని ఆ అభ్యర్థి పూర్తి వివరాలను మనం వెంటనే తెలుసుకోవచ్చు. ప్రస్తుతానికి ఈ యాప్‌లో 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల నుంచి ఆ తర్వాత జరిగిన ఎన్నికల సమాచారం అందుబాటులో ఉంది.



ఎచ్చెర్ల క్యాంపస్: ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తనదైన శైలిలో ప్రచారం చేస్తూ ప్రజలకు దగ్గరవుతున్నారు. ముద్దాడలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడారు.

జనం మనసులు గెలిచేలా..

ప్రచార పర్వం

అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ జనం మనసులు గెలిచేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ గుర్తులతో సంబరంలా ప్రచారాలు నిర్వహిస్తున్నారు.



సరుబుజ్జిలి: స్పీకర్ తమ్మినేని సీతారాం స్పీడు పెంచారు. కొండవలసలో ఇలా మహిళలను కలిసి వారికి సంక్షేమాలు వివరించారు.



జలుమూరు: ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పల్లె ప్రజలను పలకరిస్తున్నారు. జలుమూరులో ప్రచార రథాన్ని పరుగులు పెట్టించారు.



కవిటి: ఇచ్ఛాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ప్రజల మనసులు గెలుచుకుంటున్నారు. జగతిలో ప్రచారం చేస్తుండగా ఓ ఆడ పడుచు ఇలా అభిమానం చూపించారు.



శ్రీకాకుళం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ జిల్లా మొత్తం చుట్టేస్తున్నారు. కొత్తూరు మండలం కాశీపురం కూడలి ఇలా పార్టీ నాయకులతో మాట్లాడారు.



వజ్రపుకొత్తూరు: మంత్రి సీదిరి అప్పలరాజు ప్రజల అభిమానం చూరగొంటున్నారు. యూఆర్‌కేపురంలో మహిళలు ఇలా ఆప్యాయంగా ఆశీర్వదించి విజయ తిలకం దిద్దారు.



గార: మంత్రి ధర్మాన ప్రసాదరావు తన ఉత్తేజ ప్రసంగాలతో జనాలను ఉత్సాహ పరుస్తున్నారు. రామచంద్రాపురంలో ప్రచార రథంపై నుంచి ప్రసంగించారు.



పాతపట్నం: ఎమ్మెల్యే రెడ్డి శాంతి సామాన్యులతో కలిసిపోతున్నారు. కొరసవాడ శివరాంపురం వద్ద ఉపాధి హామీ వేతనదారులతో మాట్లాడారు.